# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



# 13 వ భాగం

## హాలాహలం – నీలకంఠుడు - 1

అమృతంకోసం దేవదానవులు పాలసముద్రం చిలకడం మొదలుపెట్టారు కదా? విష్ణువు కింద శ్రీకూర్మమై మంధరపర్వతాన్ని మోస్తున్నాడు. తిరుగుతూంటే అమృతం వెంఠనే పుట్టిందా? మొదట్లోనే అమృతం పుడుతుందని ఎవరూ హామీ ఇవ్వలేదు దేవతలకి. పాలసముద్రం చిలికితే అమృతం దొరుకుతుంది అని చెప్పేడు విష్ణువు అంతే. ఇలా ధ్యానంలో కూర్చోగానే నిర్వికల్ప సమాధి కావాలంటే ఎలా? అది రావడానికి ముందు చాలా శ్రమ పడాలి. కల్మషాలన్నీ వదిలించుకోవాలి. కోరికలన్నీ విడనాడాలి. మోక్షం కావాలనే కోరిక కూడా ఉండకూడదుట. అంటే మోక్షాన్ని కూడా సన్యసించాలి. ఈలోగా దొరికే సిద్ధులనన్నింటినీ విసర్జించాలి. ఇవన్నీ జరగడానికి సమయం పడుతుంది. కానీ ఇవన్నీ ముందే చెప్తే ఎంతమందికి ధ్యానం అంటే ఇష్టం ఏర్పడవచ్చు? అందుకే అమృతం దొరుకుతుంది అనే ఆశ చూపించి ఇలా పాలసముద్రం చిలకడం.

"....దనుజ దివిజ భటాట్టహాస తర్జనగర్జనధ్వనులు నలుపురియై మొత్తినట్లైన శదిగంతభిత్తులును;బేఁటెత్తి పెల్లగిలం ద్రుళ్ళుచుఁ గికురు పొడుచుచు నొక్కఁడొకనికంటె వడియునుం గడపునుం గలుగఁ ద్రచ్చుచుఁ బంతంబు లిచ్చుచుసుధాజననంబుఁ జింతించుచు నూతనపదార్థంబులకు నెదుళ్ళు చూచుచు నెంతదడవు ద్రత్తుమని హరి నడుగుచు నెడపడని తమకంబుల నంతకంతకు మురువుడింపక త్రచ్చు సమయంబున." అంటే వాళ్లకి కూడా కంగారు ఎక్కువైపోయింది. ఇంకా ఎంతసేపు చిలకాలి అని హరిని అడుగుతున్నారు మధ్య మధ్యలో. కొత్త కొత్తగా సముద్రంలోంచి ఏమైనా పుడతాయేమో అని చూస్తున్నారు.

**క.అప్పాలవెల్లి లోపల**

**నప్పటికప్పటికి మందరాగము దిరుగం**

**జప్పుడు నిండె నజాండము**

**చెప్పెడి దే మజుని చెవులు చిందఱగొనియెన్.** [౮-౨౦౯]

ఇంతటి మంధరపర్వతం ఆపాలసముద్రంలో తిరుగుతూ ఉంటే, అది పుట్టించే చప్పుడు ఏమని చెప్పగలం? చెవులు చిల్లులు పడిపోయేలాగ ఉంది.

క. ఎడమఁ గుడి మునుపు దిరుగుచు

గుడి నెడమను వెనుకఁ దిరుగు కులగిరి గడలిం

గడ లెడల సురలు నసురులుఁ

దొడితొడి ఫణి ఫణము మొదలుఁ దుదియును దిగువన్. [8-211]

ఎలా తిరుగుతోంది ఆ పర్వతం? కుడి నుంచి ఎడమకీ, ఎడమనుండి కుడికీ దేవదానవులు వడివడిగా తిప్పుతూ తలా తోకా పట్టుకుని లాగుతూ ఉంటే తిరుగుతోంది.

క. అమరాసుర కర విపరి

భ్రమణ ధరాధరవరేంద్ర భ్రమణంబును దాఁ

గమఠేంద్రు వీపు తీఁటను

శమియింపఁగఁ జాలదయ్యె జగతీనాథా! [8-213]

ఇంత కష్టపడి తిప్పినా సరే ఈ పర్వతం మోసే తాబేలు వీపు దురదని కూడా పోగొట్టలేకపోయింది. అంటే ఈ పర్వతాన్నీ, దాని కదలికనీ చాలా సులభంగా తట్టుకోగలిగింది.

క.ఆలోల జలధి లోపల

నాలో నహి విడిచి సురలు నసురులుఁ బఱవం

గీలా కోలాహలమై

హాలాహల విషము పుట్టె నవనీనాథా! [8-215]

అమృతం కోసం చూస్తుంటే హాలాహలం పుట్టింది ముందు. మనసులో ఉన్న చెడు అంతా వదుల్చుకోకుండా మిగతావి ఎలా సిద్ధిస్తాయి? అందుకే ముందు పుట్టింది హాలాహలం. అది ఎలా ఉందంటే "అదియునుం బ్రళయకాలాభీల ఫాలలోచన లోచనానల శతంబు చందంబు ననమందంబై....బగిలిపడిన పర్వతంబులును భస్మంబులైన ప్రాణి సంఘంబులును; వేఁగిన లోకంబులును; వివశలైన దిశలును; నొద్దగెడవులైన భూజచయంబులును; నఱవఱలైన భూములునునై యకాల విలయకాలంబై తోచుచున్న సమయంబున". అకాలంలో విలయం అని అనిపిస్తోందిట. ప్రపంచం అంతా భస్మం అయిపోయేలాగ ఉంది. ఇప్పుడు దీన్ని నివారించడానికి ఎవరున్నారు? విష్ణువేమో మనకూడా చిలుకుతున్నాడు. అదీగాక ఆయన లయకారుడు కాదు. అందుచేత వెంటనే వీళ్ళకి శివుడు గుర్తుకొచ్చేడు.

మ.చని కైలాసముఁ జొచ్చి శంకరుని వాసద్వారముం జేరి యీ

శుని దౌవారికు లడ్డపడఁ దల మంచుం జొచ్చి "కుయ్యో మొఱో

విను; మాలింపుము; చిత్తగింపుము; దయన్ వీక్షింపు" మం చంబుజా

**సనముఖ్యుల్ గని రార్తరక్షణ కళాసంరంభునిన్ శంభునిన్.** [8-219]

ఇలా వెళ్ళి ఆయనతో మొరపెట్టుకున్నారు. ఇందులో పోతన దేవతలు ఎలా అడిగారో చమత్కరించాడు. ఇక్కడ శివుణ్ణి శంకరుడని సంభోదించేడు – శంకరుడంటే సుఖాల్ని ఇచ్చేవాడని అర్ధం కదా? మనకి కావాల్సిన పని అవ్వాలంటే ముందు పొగడాలి; "..భోగిభూషణునకు సాష్టాంగ దండప్రణామంబులు గావించి ప్రజాపతి ముఖ్యు లిట్లని స్తుతించిరి." అంచేత ఇప్పుడు ఉబ్బులింగడితో అంటున్నారు.

**సీ. భూతాత్మ! భూతేశ! భూత భావనరూప!**
**దేవ! మహాదేవ! దేవవంద్య!**
**యీ లోకముల కెల్ల నీశ్వరుండవు నీవ;**
**బంధమోక్షములకుఁ బ్రభుఁడ వీవ;**
**యార్త శరణ్యుండ వగు గురుండవు నిన్నుఁ**
**గోరి భజింతురు కుశలమతులు;**
**సకల సృష్టి స్థితి సంహారకర్తవై**
**బ్రహ్మ విష్ణు శివాఖ్యఁ బరఁగు దీవ;** [8-222]

**క. నీ యంద సంభవించును**
**నీ యంద వసించి యుండు నిఖిల జగములున్**
**నీ యంద లయముఁ బొందును**
**నీ యుదరము సర్వభూత నిలయము. రుద్రా!** [8-223]

నీ యుదరము సర్వభూత నిలయము, నీవు ఆర్తత్రాయణ పరయణుడివి, బంధమోక్షములకు ప్రభువి నువ్వు; అందులో మళ్ళీ సకల సృష్టి స్థితి సంహారకర్తవి. అందుచేత దీన్ని నివారించగలవు.

నీలో పుట్టి నీలో లయిస్తాయి జగాలన్నీ. అంటే ఈ విషం నువ్వు పుట్టిందే సుమా, అని చెప్తున్నారన్న మాట. అందుచేత దీన్ని నువ్వే తీసేయగలవు.

**క. కొందఱు గలఁ డందురు నినుఁ;**
**గొందఱు లేఁ డందు; రతఁడు గుణి గాఁ డనుచుం**
**గొందఱు; గలఁ డని లేఁ డని**
**కొందల మందుదురు నిన్నుఁ గూర్చి మహేశా!** [8-225]

కొంతమంది నువ్వు ఉన్నాడంటారు; కొంతమంది లేడంటారు; కొంతమంది ఉన్నాడా లేడా అని కలతచెందుతూ ఉంటారు. అంటే ఉన్నావా లేవా అని అంత సులభంగా తెలిసేవాడివి కాదు. గజేంద్రమోక్షంలో 'కలడందురు దీనుల ఎడ..." అనే పద్యం దీనికి దాదాపుగా సరిపోయినట్టు లేదూ?

**మత్త. బాహుశక్తి సురాసురుల్ చని పాలవెల్లి మథింప హా**

**లాహలంబు జనించె నేరి కలంఘ్యు మై భువనంబు గో**

**లాహలంబుగఁ జేసి చిచ్చును లాగముం గొని ప్రాణిసం**

**దోహముున్ బ్రతికింపవే దయ దొంగలింపఁగ నీశ్వరా!** [8-229]

ఇదిగో ఇలా కష్టపడి పాలసముద్రం అమృతం కోసం చిలికితే హాలాహలం బయటకొచ్చింది. దీన్ని స్వీకరించి నివారించగలిగేవాడివి నువ్వొక్కడవే.

**క. లంపటము నివారింపను**

**సంపదఁ గృపజేయ జయము సంపాదింపం**

**జంపెడివారి వధింపను**

**సొంపారఁగ నీక చెల్లు సోమార్ధధరా!** [8-230]

ఈ లంపటం నివారించి మమ్మల్ని ఆదుకోవాలి అని అడుగుతున్నారు. ఈ పాటికి ఆయనికి తెల్సింది ఏమిచెయ్యాలో. శివానందలహరిలో శంకరభగవత్పాదులు ఇలా అంటారు. శివుడూ, పార్వతీ ఒకరికొకరుగా ఆది దంపతులు ఎలా అయ్యారనేది చెప్తూ.

**కలాభ్యాం చూడాలంకృత శశికలాభ్యాం నిజతపః**

**ఫలాభ్యాం భక్తేషు ప్రకటితఫలాభ్యాం భవతు మే**

**శివాభ్యా మస్తోకత్రిభువనశివాభ్యాం హృది పున**

**ర్భవాభ్యా మానందస్ఫురదనుభవాభ్యాం నతిరయం** [శివానందలహరి - 1]

ఒకరికోసం ఒకరు చేసిన ఉగ్రమైన తపస్సు వల్ల అర్ధనారీశ్వరులై లోకాలన్నింటికీ శుభం చేకూర్చేవాళ్ళయ్యేరుట (అంటే మామూలుగా పెళ్ళిచూపుల్లో ఒకళ్ళనొకరు ఇష్టపడి చేసుకున్న పెళ్ళి కాదు. ఒకరి కోసం ఒకరు ఉగ్రమైన తపస్సు చేసి సాధించారు.) ధ్యానంచేసేవాళ్లకి ప్రతీ నిముషం హృదయంలో కనపడుతూ ముముక్షువులకి ఆనందసాక్షాత్కారం ఇచ్చే సమస్త విద్యా స్వరూపులైన గౌరీ శంకరులకి నమస్కారం.

వీళ్ళు ఇటువంటివాళ్ళు కనక శివుడితో ఇలా మొరపెట్టుకునేసరికి శివుడు పార్వతికేసి చూసాడు. జగజ్జననిని అడగలేదే మరి అని ఆవిడ అనుకోకూడదు. దేవతలేమో పాపం కంగార్లో ఉన్నారు అవతల ముంచుకొచ్చే ఉపద్రవం చూసి. ఇలా అమ్మవార్నీ, శివుడ్నీ విడివిడిగా అడగాలని ఆ క్షణంలో గుర్తుండదు. కానీ శివుడేమో అర్ధనారీశ్వరుడు. హాలాహలం తీసుకోడానికి ఆవిడ వద్దనదు కానీ ఆవిడతో

చెప్తే మంచిది కదా? ఎవరేనా “ఇలా విషం తిటున్నాను అవతలవాళ్ళకి సహాయం చేయడానికి” అంటే వాళ్ళావిడ ఏమంటుంది? సర్వ మంగళ ఏమందో వచ్చే వ్యాసంలో.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS